

# గౌరవం!

వసుంధర

రచయితలు నా ఆరాధ్యదైవాలు.

మన కంటికి ఎంతో సామాన్యమైనదిగా కనిపించే విశేషాన్ని వారు కవితా దృష్టితో చూసి సామాన్యులకు అలౌకిక దృష్టిని కలిగిస్తారు.

రచయితల్లో నేను ఎక్కువగా ఆరాధించేది రాజగోపాలాన్ని!

రాజగోపాలం అందరిలాంటివాడు కాదు. ఈ సమాజాన్ని చూసి అతడు చెందే వేదన ఇంతా అంతా కాదు. సాటి పౌరుణ్ణి చూసి రవంత జాలిని ప్రదర్శించలేని, తోటివాడి ఆకలిని అలక్ష్యంచేసి ఇంట్లో కుక్కల్ని మేపగలిగే-ఈ వ్యవస్థనాతడు అసహ్యించుకుంటాడు.

మన వ్యవస్థ ఇంత నీరసంగా ఉండడానికి మూలకారణాన్ని రాజగోపాలం కనిపెట్టాడు. అదే మతం!

మతం మనిషి ఆలోచనల్ని స్తంభింపజేస్తుంది. మనిషిలో స్వార్థాన్ని పెంచుతుంది. మనిషిలో విప్లవభావాలు నాటనివ్వక అతడిని నిర్వీర్యుణ్ణి చేస్తుంది.

మతానికి ఎదురు తిరుగు
ఎందుకంటే అదే నీ గతం
నిన్ను పట్టి పీడిస్తున్న భూతం

అని అతడు ఎన్నో కవితల్లో ఆక్రోశించాడు. అతడి ఆక్రోశం ఎందరో యువకులపై ప్రభావాన్ని చూపించింది. దేశమంతటా అతడి నభిమానిస్తూ ఎన్నో అభిమానసంఘా లేర్పడ్డాయి. సినీ నటులను మించిన గ్లామర్‌తో అతడు జీవిస్తున్నాడు.

రాజగోపాలంలో ఇంకా చాలా విశేషాలున్నాయి.

అతడికి సన్మాన సభలంటే చిరాకు. కొందరు పేరున్న పెద్దలు తమ పేరుకు మరింత ప్రాబల్యం లభించడంకోసం ఏర్పరచేవే సన్మానసభలని అతడి అభిప్రాయం. అతడెప్పుడూ విద్యార్థులనూ, యువతరాన్ని మాత్రం ప్రభావితుల్ని చేయడానికే సభలకు వెళ్ళేవాడు. ఎవరే బిరుదులనిచ్చినా స్వీకరించేవాడు కాదు.

అతడి కవిత్వంలోని పసను చూసి సినీ నిర్మాతలతడికోసం ఎగబడ్డారు. అతడు ఒక్క నిర్మాతకుకూడా లొంగలేదు.

రాజగోపాలం వస్తున్నాడు
యువతరాన్ని
ప్రభావితం చేస్తున్నాడు
ఆ తర్వాత
ప్రజలెవ్వరూ మీ సినిమాలు చూడరు
చూసినవారు ప్రజలు కారు
ప్రజలంతా అతడి కవిత్వం వింటారు
అతడి కవిత్వం విన్నవారే ప్రజ
లౌతారు....

అని రాజగోపాలం చెప్పిన గేయం దేశమంతటా ప్రచారం సంపాదించింది. రాజగోపాలం సినిమాలను కూడా తన కవిత్వంలో వీలైనంతగా దుయ్యబడుతూండేవాడు.

రాజగోపాలం చేసిన ప్రతి రచనా, చెప్పిన ప్రతి కవితా నన్ను ఆకర్షించింది. దేశం ముందుకు నడవకపోవడానికి గల కారణాలన్నీ అతడావిష్కరించ పట్టాడనీ, అతడి రచనలతో దేశం స్వరూపం పూర్తిగా మారిపోగలదనీ నేను నమ్మాను.

అలా పదేళ్ళు గడిచాయి.

రాజగోపాలం రచనలు పుంఖానుపుంఖాలుగా వస్తూనే ఉన్నాయి. అతడి ప్రతి రచనా దేశంలో గొప్ప సంచలనాన్ని కలిగించి, విమర్శకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

కాని అతడి ప్రయత్నం బూడిదలో పోసిన పన్నీరే అవుతున్నది. అతడి కవిత్వం విని మెచ్చుకునేవారి సంఖ్య పెరుగుతున్నది కానీ దేశంలో మరేవిధమైన మార్పు కనిపించడంలేదు.

యువతరంలో సామాజిక స్పృహ ఏర్పడినా ఏర్పడకున్నా భక్తిభావం నానాటికీ పెంపొందుతున్నది. దేశంలో ఆల

యాల సంఖ్య పెరుగుతున్నది. భక్తుల సంఖ్య పెరుగుతున్నది. దేవుడి పేరిట వెలిసే పందిళ్ళ ఉత్సవములు మరింతగా పెరుగుతున్నది. ఏ వ్యాపార సంగతి ఎలా వున్నా దేవుడిపేరు చెప్పి చేసే వ్యాపారం మూడు పువ్వులూ ఆరు కాయలుగా విలసిల్లుతున్నది.

ఇది నాకెంతో బాధ కలిగించింది.

రాజగోపాలం కవిత్వంతో యువతరాన్ని ఎంతవరకూ ప్రభావితం చేయగలుగుతున్నాడు? అతడు ఒక్కడే అయిపోయినాడా? అతడివంటి కవులు మరికొందరు జతగూడితే అందువల్ల దేశానికేమైనా ప్రయోజనముంటుందా?

ఈ విషయమై నేనే ఒకసారి రాజగోపాలాన్ని కలుసుకుని మాట్లాడాలనుకున్నాను. అతడిని గతంలో అనేకసార్లు సభలు, సమావేశాల్లో కలుసుకుని ఉన్నాను. తను చెప్పేది ప్రతిదీ ఆచరణలో చూపే రాజగోపాలాన్ని చూడగానే నాలో భక్తి భావం జనించి అతడితో ఇంకేమీ మాట్లాడలేకపోయేవాడిని.

రాజగోపాలం ఇంటికి వెడితేతప్ప అతడితో నాకు పూర్తిగా మాట్లాడే అవకాశం రాదు.

రాజగోపాలం ఇంటికి వెళాలని నే ననుకొనడానికి మరో కారణం ఉంది. అతడి కవిత్వం విని ప్రభావితురాలైన ఒక అభిమాన పాఠకురాలు సులోచన అతడిని ప్రేమించి వివాహం చేసుకుంది. వారిది ఆదర దాంపత్యమని అంతా చెప్పుకుంటారు. భర్తను కవిత్వానికి ప్రోత్సహిస్తూ, అతడి దృష్టిని వ్యాపార దృక్పథానికి గురికాకుండా కాపాడుకుంటూ గుట్టుగా కాపురం నెట్టుకువస్తున్నదని ఎన్నో సాహిత్యపత్రిక లామె గురించి గొప్పగా రాశాయి.

ఆమెనూ ఒకసారి దర్శించుకోవాలన్నది నా తాపత్రయం.

మొత్తంమీద ఒకరోజు పనిగట్టుకుని విశాఖపట్నం వెళ్ళి ఆ ప్రముఖుడిని, నా ఆరాధ్యదైవాన్ని కలుసుకున్నాను.

అతడి ఇంట్లో నాకు చెప్పుకోదగ్గ ఆదరణే లభించింది.

"మీరు కవిత్వమెందుకు రాస్తున్నారో తెలుసుకోవాలని అంతదూరం ప్రయాణం చేసి వచ్చాను" – అని అతడికి నిజం చెప్పాను.

"యువతరాన్ని ప్రభావితుల్ని చేయడం నా లక్ష్యం" – అన్నాడు రాజగోపాలం. తన లక్ష్యం విషయంలో వేరే ఏమీ సందేహాలుండనవసరంలేదన్న చిరునవ్వు అతడి ముఖాన వెలసింది.

ఆ విషయంలో ఎంతవరకూ సఫలీకృతులయ్యారు?

రాజగోపాలం నవ్వి–"ప్రయత్నమే నా ధ్యేయం – ఫలితమే నా గేయం–" అన్నాడు.

"ఆ తర్వాత......" అన్నాను.

"రాళ్ళూ ముళ్ళూ ఉన్న బాటలో
కవి భావం పయనం చేస్తే
గేయాలకు గాయాలైనా
కవితకు మాత్రం బ్రేకులుండవు–

అన్నాడు రాజగోపాలం రాగయుక్తంగా

అప్రయత్నంగా అతడికి నమస్కరించి "అద్భుతమైనది మీకవిహృదయం. మిమ్మల్ని మీ యింట కలుసుకున్నందుకు నా జన్మ చరితార్థమయింది. మీ వలన తప్పక యువతరం ప్రభావితమవుతుంది – "అన్నాను.

సరిగ్గా అప్పుడే అక్కడకు వచ్చింది నుదుట రూపాయకాసంత బొట్టు. చేతికి పసుపులోరం. చేతిలో స్టీలు పళ్ళెం. పళ్ళెంలో పువ్వులు, అకులు......

"ప్రసాదం తీసుకోండి...." అన్నదామె.

ఆమె సులోచన అని గుర్తించాను. రాజగోపాలం భార్య చేతిలో ప్రసాదం నాకు కాస్త ఆశ్చర్యం కలిగించినా అప్రయత్నంగా అతడితోపాటు నేనూ చేయి చాపి ప్రసాదం అందుకున్నాను.

ఆమె లోపలకు వెళ్ళాక – "దేశం ప్రగతికి మతమే నిరోధకమని భావించే మీరు – భార్యను పూజలు చేయనిస్తున్నారా?" అన్నాను ఆశ్చర్యంగా.

రాజగోపాలం వెంటనే – "ఇందులో నా అభిప్రాయాలలో నిమిత్తమేముంది? నేను స్వాతంత్ర్యానికి విలువ నిస్తాను–" అన్నాడు.

"అంటే?"

"ఆమె అలవాట్లను, అభిరుచులను నేను శాసించను. నా అభిప్రాయాలను ఆమె గౌరవిస్తే, ఆమె అభిప్రాయాలను నేను గౌరవిస్తాను. అదీ మా అనుబంధం –" అన్నాడు రాజగోపాలం.

నేను అతడి వద్ద సెలవు తీసుకుని అక్కణ్ణించి బయటపడ్డాను.

తన కవిత్వం కోసం తనను ప్రేమించి పెళ్ళిచేసుకున్న భార్య పైనే రాజగోపాలం ప్రభావం లేదు. అతడి కవిత్వం యువతరాన్నేం ప్రభావితం చేస్తుంది?

ఇరవైనాలుగు గంటలూ అతడినే అంటిపెట్టుకుని ఉండే సులోచనపై ప్రభావాన్ని చూపించలేని రాజగోపాలం– ఎప్పుడో తన కవిత్వాన్ని చదివే యువతరాన్నేం ప్రభావితం చేయగలడు?

అందుకే అంతా అతడి కవిత్వాన్ని గౌరవిస్తారు. ఎవ్వరూ దానివల్ల ప్రభావితులు కాలేరు.